అభివృద్ధి పనుల్లో ప్రణాళికతో ముందుకెళ్లాలి





ఐడీఎల్ చెరువు వద్ద నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు

కూకట్‌పల్లి: ఐడీఎల్ చెరువు వద్ద జరుగుతున్న నాలా పనులను మంగళవారం అధికారులతో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. స్థానికులు, స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌వాసులు, ఇతర బస్తీవాసులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టే వారికి నాలా కోసం తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, అధికారులు, ఇరిగేషన్ ఈఈ నారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి ఉమాదేవి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, హెచ్‌ఎండబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

500 ఏళ్ల తర్వాత భారతీయుల కల నెరవేరింది

- మాజీ మంత్రి ఈటల రాజేందర్
- హనుమాన్ చౌక్‌లో ఆంజనేయ విగ్రహావిష్కరణ



హనుమాన్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: అయోధ్య రామమందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని మూసాపేట హనుమాన్ చౌక్ వద్ద హనుమాన్ విగ్రహావిష్కరణ వేడుకను మంగళవారం నిర్వహించారు. మహావీర్ భక్త మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరై ప్రసంగించారు. 500 ఏళ్ల తర్వాత దేశ ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. లక్షలాది హిందువులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పోరాటాలు చేసి రామ జన్మభూమిని సాధించుకున్నారని గుర్తుచేశారు. నేటి యువత, నేటి సమాజం రాముడిని, రాముడు ఆచరించిన విధానాలని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. రాముడు ధర్మమూర్తి, ఆదర్శప్రాయుడని అనేకసార్లు మన పెద్దలు చెప్పిన విషయాలను రానున్న భావితరాలకు నేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనేక మంది కర సేవకులు రక్తాన్ని చిందించి ప్రాణాల్ని అర్పించి అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తూ సాధించిన ఫలితమే ఈ రామ మందిర నిర్మాణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, మహావీర్‌భక్త మండలి అధ్యక్షుడు కోడిచెర్ల సంతోష్ కుమార్, జిల్లా గోపాల్, మహావీర్ భక్త మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో నాలాలను అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గాలలోని నాలాలను అభివృద్ధి చేసి రిటర్నింగ్ వాల్స్ నిర్మించాలన్నారు. పార్కులు, గ్రేవ్ యార్డులు, రోడ్లకు సంబంధించి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా సత్వరమే నిధులు మంజూరు చేసి త్వరగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. ప్రభుత్వం ఏదైనా అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజల కోసమే మేమున్నామనే భరోసా కల్పించాలన్నారు. సమస్యలను విన్న జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



జెడ్‌సీ అభిలాష్ అభినవ్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు



ఉండలు చుడుతుందిలా..





ప్రెస్సింగ్ అయి మెషిన్ లోపలికి వెళ్లి తయారై వస్తున్న రోటీలు

ఇన్ఫెక్షన్ ఫ్రీ రోటీ @గాంధీ

గంటలో 1000 స్వచ్ఛమైన చపాతీలు తయారీ

- 'గాంధీ డైట్ కిచెన్'లో అధునాతన రోటీ మేకర్
- ప్రభుత్వ డైట్ కిచెన్లలో ఇదే ప్రథమం
- సమయం ఆదా అంటున్న నిర్వాహకులు



పిండి కలుపుతున్న మెషిన్

గాంధీఆస్పత్రి : సాధారణంగా వెయ్యి రోటీలు (రొట్టెలు) తయారు చేయాలంటే కనీసం ఐదుగురు మనుషులు కలిసి దాదాపుగా ఐదు గంటలు కష్టపడాలి. పిండి కలపాలి, ఉండలు చుట్టాలి, ప్రెస్సింగ్ చేయాలి, పెనంపై కాల్చాలి. ఎవరి సహాయం లేకుండానే గంట సమయంలో వెయ్యి రోటీలు తయారు చేయగలిగితే అబ్బో అదో అద్భుతం అంటాం. పిండి కలపడం నుంచి రోటీ తయారు చేసే వరకు అన్ని పనులు మెషినే చేసుకుంటుంది. అలాంటిఅత్యాధునిక రోటీ మేకర్ మెషిన్ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ కిచెన్‌లో ఇటీవల అందుబాటులోకి వచ్చింది. వివిధ రుగ్మతలతో చికిత్సలు పొందుతున్న రోగులకు మరింత ఆరోగ్యవంతమైన, స్వచ్ఛమైన రోటీలు అందించేందుకు సంబంధిత అధికారుల సూచన మేరకు గాంధీ డైట్ కాంట్రాక్టు నిర్వాహకుడు, శ్రీ వెంకటేశ్వర అసోషియేషన్ అధినేత రవికుమార్ లక్షలాది రూపాయలు వెచ్చించి రోటీ మేకర్ మెషిన్‌ను గుజరాత్ నుంచి తెప్పించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల డైట్ క్యాంటీన్లలో ఇలాంటి రోటీ మేకర్ మెషిన్ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని గాంధీ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ డైట్ కిచెన్లలో ఏర్పాటుకు సన్నాహాలు

తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల డైట్ కిచెన్లలో ఇలాంటి రోటీ మేకర్ మెషిన్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చేతితో తయారు చేస్తే సిబ్బంది చేతులు, శరీరానికి అంటుకుని ఉండే పలు రకాల బ్యాక్టీరియా, వైరస్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇన్ఫెక్షన్లు కలిగే అవకాశం ఉందని, రోటీ మేకర్‌తో ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, చీఫ్ డైటీషియన్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఆరోగ్యవంతమైన, రుచికరమైన, స్వచ్ఛమైన రోటీలు నిరుపేద రోగులకు అందించే అవకాశం రోటీమేకర్ ద్వారా కలుగుతుందని, మెషిన్ పర్యవేక్షణకు ఒక్కరు సరిపోతారని వివరించారు.

పనితీరు ఇలా..

పిండి కలపడం: ఈ మెషిన్ పది కిలోల గోధుమ పిండిని నిమిషాల వ్యవధిలో సమపాళ్లలో కలుపుతుంది.

ఉండలు చుట్టడం: కలిపిన పిండి ముద్దను ఈ మెషిన్‌లో వేస్తే అనుకున్న సమయాని కన్నా ముందే ఉండలుగా చుట్టి కటింగ్ చేస్తోంది.

ప్రెస్సింగ్ చేయడం: చుట్టిన ఉండలను ఈ మెషిన్ ప్రెస్సింగ్ చేస్తుంది.. మీటరు దూరం వరకు ట్రాలీపై మెషిన్ లోపల భాగంలోకి చేరుతుంది.

కాల్చడం: మెషిన్ లోపల భాగంలో ఏర్పాటు చేసిన సన్నని మంటపై రోటీని కాల్చుతుంది. కాలిన రోటీ సన్నని మార్గం నుంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న ప్లేట్‌లో పడుతాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కారణంగా పలు డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయా డివిజన్‌లో ఏఈలు మంగళవారం పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్‌ను బుధవారం పలు ప్రాంతాల్లో నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

◆ **గాయత్రినగర్, అల్లాపూర్ ఫీడర్ల పరిధిలో...**

అల్లాపూర్: గాయత్రినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్, తులసినగర్ ప్రాంతాలో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు. అల్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అల్లాపూర్, ఇండోర్ స్టేడియం, హరిహర దేవాలయం, ఫ్రెండ్స్‌కాలనీ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **హబీబ్‌నగర్ ఫీడర్ పరిధిలో..**

మూసాపేట: హబీబ్‌నగర్11 కేవీ ఫీడర్ పరిధిలోని హబీబ్‌నగర్, ప్రగతి నగర్, మూసాపేట, వసుంధర ఆసుపత్రి, పవర్‌నగర్, ఆంజనేయనగర్‌లలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. అంకురా ఆసుపత్రి, ఏపీహెచ్‌బీ 7వ ఫేజ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శంకర్ తెలిపారు.

◆ **వసంత్‌నగర్ ఫీడర్ పరిధిలో...**

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ వసంత్‌నగర్ ఫీడర్ పరిధిలోని వినాయకపార్కు ప్రాంతం, గోకుల్ ప్లాట్స్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు. గోపాల్‌నగర్, గోకుల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2గంటల వరకు. సాయిహిల్స్, గోకుల్ ప్లాట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **సోమశిల సబ్‌స్టేషన్ పరిధిలో...**

భాగ్యనగర్‌కాలనీ: శ్రీసాయినగర్ ఫీడర్ పరిధిలోని శ్రీసాయినగర్, సాయిబాబా దేవాలయం, మైత్రీ నగర్, దయార్‌గూడ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు. శేషాద్రినగర్, సోమశిల సబ్‌స్టేషన్ పరిధిలోని శేషాద్రినగర్, వెంకటరావునగర్, సాయిబాబా కాలనీ, టవర్ లైన్ రోడ్డు, పాపారాయుడు నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.

◆ శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో తులసినగర్, సాయి చరణ్ కాలనీ ఉదయం 10.30 ఉంచి 12.30 గంటల వరకు. హెచ్‌ఎంటీహిల్స్, వినాయక్‌నగర్ ఫీడర్ల పరిధిలో శాతవాణనగర్, రాంకి విల్లాస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు.

◆ లాస్ట్‌బస్టాప్ ఫీడర్ పరిధిలోని లాస్ట్ బస్టాప్, ధరణినగర్, కాకతీయ నగర్, చక్రధర్ నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, జలకన్య, ఆదిత్య నగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు. జలకన్య ఫీడర్ పరిధిలోని శివనగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, రాఘవేంద్ర కాలనీ, సాయి కళ్యాణ మండపం, జయశంకర్ కాలనీ, భూదేవి హిల్స్, తులసి నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

15వ రోజుకు చేరిన విద్యార్థుల ధర్నా

ఏజీవర్సిటీ: ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టు నూతన భవనాలకు కేటాయించవద్దని ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 55 ను రద్దు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యార్థులు చేస్తున్న ధర్నా 15వ రోజుకు చేరుకుంది. వీరికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యానవన భూములపై అశ్రద్ధ వహిస్తే తీరని నష్టం వాటిలుతుందని రాష్ట వ్యవసాయ రంగానికి భవిష్యత్తులో పరిశోధనలు, నూతన వంగాడాల ఆవిష్కరణలకు ఇది చెంపపెట్టులాంటిదని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళన బాట పట్టాల్సివస్తుందని అన్నారు.

భాషల వెనుక వ్యవస్థీకృత నిర్మాణం

పద్మశ్రీ అన్విత అబ్బి

రాయదుర్గం: భాష అనేది విజ్ఞాన భాండాగారమని కెనడాలోని సైమన్ ఫ్రెజర్ యూనివర్శిటీ లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్ పద్మశ్రీ అన్విత అబ్బి తెలిపారు. గచ్చిబౌలి ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చైర్ ఆధ్వర్యంలో 'పర్యావరణ వైవిధ్యం భాష అండ్ సంస్కృతి' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్విత మాట్లాడారు. భాష అనేది అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికి సహాయపడే సాధనమన్నారు. అన్ని భాషల వెనుక ఒక వ్యవస్థీకృత నిర్మాణం ఉంటుందని తెలిపారు. మనదేశంలో కనీసం 800 నుంచి 1000 భాషలు ఉన్నాయని, ఆయా భాషలలో ఉన్న సంస్కృతి గొప్పవని చెప్పారు. భాషావేత్తలను స్పీచ్ డిటెక్టివ్‌లుగా అభివర్ణించారు. మాతృభాషల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ చాలా మంది పాఠశాలలకు వెళ్లకుండానే సొంత భాషను నేర్చుకోవడం గొప్పవిషయమన్నారు. భాషావేత్తల కృషిని ఈ సందర్భంగా ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభినందించారు. ప్రొ. షుగుఫ్తా షాహీన్, రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్, మౌలానా కలామ్ ఆజాద్ చైర్ ప్రొ. సయ్యద్ ఇంతియాజ్ హస్నైన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావేత్తలు సన్నద్ధం కావాలి

రాయదుర్గం: వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో విద్యావేత్తలను సన్నద్ధం చేయాలని న్యూఢిల్లీలోని యునెస్కో ప్రాంతీయ కార్యాలయ సోషల్ అండ్ హ్యూమన్ సైన్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐశ్వర్య సెహగల్ పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలో యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్, తిరుచిరాపల్లిలోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో 'సంక్షోభ సాహిత్యాన్ని చదవడం, పరిశోధించడం' అనే అంశంపై ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఐశ్వర్య ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ.. ప్రపంచ పౌరసత్వం, భాగస్వామ్య మానవత్వపు భావాన్ని పెంపొందించే క్రమంలో విద్య కీలకంగా మారిందన్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎఫ్‌డీపీ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ యునెస్కో చైర్ ప్రొఫెసర్ ప్రమోద్ కే నాయక్, యునెస్కో చైర్ ఫ్యాకల్టీ ఫెల్లో ప్రొఫెసర్ అన్నా కురియన్, డాక్టర్ వీకే కార్తీక, తిరుచిరాపల్లి ఎన్ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.కుమరేషన్, ఎన్ఐటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఆర్ మురుగేషన్తో పాటు పలు దేశాలకు చెందిన వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు దాదాపు 550 మంది పాల్గొన్నారు.

మహనీయులే మనకు ఆదర్శం

రాయదుర్గం: మహనీయుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో మంగళవారం సర్ జేసీ బోస్, సర్ సీవీ రామన్ ప్రతిమలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం బీజేరావు మాట్లాడుతూ.. భౌతిక శాస్త్రవేత్తలు సర్ జేసీ బోస్, సర్ సీవీ రామన్ ప్రతిమలను ఒకే రోజు క్యాంపస్‌లో ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో సర్ జేసీ బోస్ ప్రతిమ కలిగి ఉండటం దేశంలోనే అరుదని తెలిపారు.

నిరంతరం కృషితో ఉన్నతస్థాయికి..

ఓయూ ప్రొఫెసర్, లా సెట్ కన్వీనర్ విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: నిరంతర కృషితో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్(ఫ్యాకల్టీ ఆఫ్ లా) ప్రొఫెసర్, లా సెట్ కన్వీనర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముత్తంగి విశ్వభారతి లా కళాశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంతకుముందు లా కళాశాల ప్రిన్సిపాల్ భవాని, అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. లా అనేది సమాజంలో ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చి పాఠాలు వింటే సబ్జెక్టులపై పట్టు సాధించవచ్చని తెలిపారు.

31 వరకు ఫుడ్ ఫెస్టివల్

గచ్చిబౌలి: ఈ నెల 31వ తేదీ వరకు అబ్సొల్యూట్ బార్బెక్యూస్‌లో దేశ, విదేశీ వంటకాలతో కూడిన 'సీ ఫుడ్ ఫెస్టివల్' కొనసాగుతుందని ఆ హోటల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ టెరిటరీ మేనేజర్ రామ్‌రంజన్ మంగళవారం తెలిపారు. నగరంలోని 13 శాఖల్లో ఈ ఫెస్టివల్ జరుగుతోందన్నారు. పిల్లలతో పాటు పెద్దల కోసం ప్రత్యేక వంటకాలతో పాటు సింగపూర్ డిషెస్ కూడా అందుబాటులో ఉంటున్నాయన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామంలో నేటి నుంచి ఐదు రోజుల పాటు వాగ్గేయకారులు శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కర్ణాటక సంగీత సంప్రదాయంలో కృతులు, దివ్యనామ సంకీర్తనలు, పంచరత్న కీర్తనల ఆలాపన ఉంటుందన్నారు. సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంఫీ థియేటర్‌లో కచేరీలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు.

శుభాకాంక్షలు

చింతల్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలికి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎమ్మెస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఆదివారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులపై గత రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కేసులు నమోదు చేయించిందన్నారు. వాటిని సైతం లెక్క చేయకుండా బల్మూరి వెంకట్ చేపట్టిన పోరాటాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనకు ఎమ్మెల్సీగా గుర్తింపునిచ్చిందని గొల్ల జాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె జీవన్, సాయికిరణ్, శివ, వేణు, విజయ్, నందీప్, నాగేందర్, అభిలాష, శివసాయి పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో పన్నాల హరీష్‌రెడ్డి, కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కార్పొరేటర్ మహేందర్ జనతానగర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీష్ సామ్రాజ్యానికి ముచ్చెమటలు పట్టించాడన్నారు.నేటి సమాజం నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారత భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. భారతదేశాన్నిప్రపంచ దేశాలను తలదన్నే విధంగా తీర్చిదిద్దుతున్న ప్రధాని మోదీ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట డివిజన్ అధ్యక్షుడు మనోహర్, నాయకులు డాకయ్య, శేఖర్‌గుప్తా, మన్నె యాదగిరి, గిర్ని రవి, పోలాకి కిషోర్, శ్రీనివాస్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయి, శ్రీనివాసాచారి, వెంకట్, నవీన్, కిషోర్, జనసేన డివిజన్ అధ్యక్షుడు సూర్య తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

పంచశీల ఉన్నత పాఠశాలలో...

మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో మంగళవారం నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు నేతాజీ గొప్పతనాన్ని బీఆర్ఎస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో పంచశీల పాఠశాల అధినేత డి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు డి.అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కార్పొరేటర్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న డివిజన్ వాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చేపట్టాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి డివిజన్ వాసులు మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. త్వరలో కాలనీల్లో పర్యటిస్తామని తెలిపారు. తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అన్ని పనులు పూర్తి చేసి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

- ఈనెల 25న జేఎన్‌టీయూలో ఓటర్ల దినోత్సవం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న గవర్నర్ తమిళిసై
- అరగంట ముందే అధికారులు చేరుకోవాలని ఆదేశం
- ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు



జేఎన్‌టీయూ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, అధికారులు

కూకట్‌పల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొంటున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవ రాష్ట్ర స్థాయి వేడుకలకు గవర్నర్ పాల్గొనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 9గంటలకు కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్రస్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సీఈఓ వికాస్ రాజ్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పాల్గొంటారని ఆయన తెలిపారు.

◆ ఏర్పాట్లపై బాధ్యతలు అప్పజెప్పిన అధికారులు సమర్థవంతంగా సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. జిల్లాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు కూకట్‌పల్లి ఆడిటోరియానికి ఉదయం 8.30 గంటలలోపు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు.

◆ డిప్యూటీ సీఈఓ హరిసింగ్ మాట్లాడుతూ.. నిర్దేశించిన ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్ చేయాలన్నారు. కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి జెడ్‌సీలు వెంకటేష్ దోత్రే, అభిలాష అభినవ్, ఈఎన్‌సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు ఉపేందర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, చార్మినార్, ఎల్బీనగర్ జెడ్‌సీలు వెంకన్న, పంకజ, ఎస్టేట్ ఆఫీసర్ మహమూద్ బాషా, డీసీ రమేష్, లీగల్ ఎలక్షన్ జాయింట్ కమిషనర్లు మైకేల్ బోస్, మంగతాయారు, సీఈఓ ఆఫీస్ స్వీప్ కన్సల్టెంట్ భవానీశంకర్, పోలీస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగిరెడ్డి, భరత్‌నగర్ కాలనీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. అశోక్ ముదిరాజ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– కూకట్‌పల్లి

